వేణునిక్వణ

దాశరథి

మంద మందంగా బొడ్డుమల్లెపూల సువాసన గాలిలో సమపాళాలో కలిసి వీచుతున్నది. అప్పుడే వేయించి పొడిగొట్టిన కాఫీగుండ్రతో కాచిన చక్కని కాఫీలా మనోహరంగా శుక్ల చతుర్దశి సాయంత్రం. చంద్రుడు ఇంచుమించు నిండుగా బొడ్డుమల్లెచెట్టువెనకగా దాక్కుని చూస్తున్నాడు. కాని దొంగను లోకమంతా కనిపెట్టేసింది. ఎంత దాక్కున్నా కనపడుతూనే వున్నాడు కొమ్మల చాటుమాటుగా— పొంగిన పాలముంతలాగా. పక్కన శివాలయంలో గంట ఖంగు ఖంగున మోగింది— భక్తులంతా వస్తూ పోతూ వున్నారు. వచ్చేపోయేవాండ్లను బొడ్డుమల్లె పూజిస్తున్నది తలలమీద పూలు రాలుస్తూ.

రామం బొడ్డుమల్లెచెట్టుక్రింద కూచుని శివాలయం ధ్వజస్తంభంవైపు చూస్తున్నాడు. ధ్వజ స్తంభంమీద వాలిన పావురాయి, రాయి విసిరితే ఎగిరిపోయినట్టు రామం చూడగానే లేచిపోయింది. తన చూపు అంత వికటమైందా? ఆలోచించుకున్నాడు రామం. అది ఎగిరిపోవడానికి తాను చూడడానికి ఏం సంబంధం? ఏదో రెండూ ఒక్కసారి అలా జరిగితే తనచూపులో విషాన్ని తలచుకోడం దేనికి అని సంతృప్తిపడ్డాడు రామం.

క్రమంగా రాత్రి హెచ్చుతున్నది. చంద్రమండలంలో అమృతం ఊరడం ఎక్కువవుతున్నది. అన్నివైపులా పుష్పపూలు పూస్తున్నాయి. నీలికాగితంమీద తెల్ల అక్షరాలలాగా ఆకాశంలో చుక్కలు – నీలి లంగామీద తెల్లని ఓణీలా ఆకాశంలో వెన్నెల.

శివాలయంలో జనం పలచబడుతున్నారు. రాత్రి ఎనిమిది కావస్తున్నది. సాయంత్రం అభ్యంజనస్నానం చేసి, తడిఆరని కురులు దిద్దుకోకుండా, హడావిడీగా పెట్టుకున్న కుంకుమబొట్టు, చేతిలో పూలబుట్ట, పెట పెటలాడుతూ ఊరికే పాదాలమీద జీరాడుతూ నడకకు అంతరాయంకలిగిస్తున్న పట్టుచీర, సీకాయరసం తాకి ఎఱ్ఱబారిన కళ్ళు, ఆభరణాలు లేకున్నా శంఖంలా అందంగా



స్వచ్ఛంగా వున్న మెడ, మెత్తని అరచేతులను, తాకి చూడాలనే కోరికతో ఊరికే కిందికి దూకే గాజులు—గబగబా నడిచి వెళుతున్నది 'వీణ'.

వారం రోజులనుంచి వీణను చూడాలని ఆ బొడ్డుమల్లె చెట్టుకింద సాయంత్రాలు కూచుంటున్నాడు రామం. వీణరాదు. ఇంటివైపు వెళ్ళే ధైర్యంలేదు. బడికి రావడం మానేసి అప్పుడే పదిరోజులైంది వీణ. ఎందుకు రావడంలేదో తనకు తెలీదు. తన ఇంట్లో వీణను గురించి ఎవ్వరూ ఏమీ అనుకోలేదు.

ఇవాళైనా తన అదృష్టం అన్నట్టు వీణ కనపడింది. అంతేచాలు అనుకున్నాడు. వీణ గబగబా నడిచివస్తోంది. చూచాడు. మల్లెలూ నీలాంబరాలూ కలిపిపోసినట్టు వెలుగు నీడలు బొడ్డుమల్లెకింద కురుస్తున్నాయి. వెలుగు నీడల్లో తనకోసం నిరీక్షిస్తున్న రామంను చూచింది వీణ. చూచీ చూడ్డంతోనే నడక వేగం హెచ్చించింది. ఫులుకుఫులుకున, చురుకు చురుకుగా, కోపకోపంగా చూస్తూ వెళ్ళిపోయింది గుళ్ళోకి.

ధ్వజస్తంభంమీది పావురాయిలా వీణకు కూడా తన చూపు, రాయిలా తాకిందా?

ఎందుకలా కోపంగా వెళ్ళిపోయింది? మళ్ళీ తన చూపుల్లోని దుష్టత వైపు ఆలోచన పోయింది రామానికి. పావురాయి ఎగిరిపోవడంలో అర్థం వుంది. తన చూపుల్లో తీపిలేదు. వట్టి చేదు చూపులు. కనుకనే పావురాయికీ, పావురాయిలాంటి వీణకూ తన చూపులు రుచించలేదు.

నిజంగా తన చూపుల్లో అంత చేదుందా? లేక గుడికి వెళుతున్నప్పుడు తాను కనపడడం ఆమెకు నచ్చలేదా? భగవంతుణ్ని దర్శించుకోడానికి వెళ్ళేప్పుడు మనస్సులో ఎట్టివికారమూ కలుగకూడదు, కనుక తాను కనపడితే అందువల్ల మనస్సులో వికారం కలుగుతుందని భయమా? కావచ్చు. దైవసన్నిధికి వెళ్ళుతున్నప్పుడు మనస్సు స్వచ్ఛంగా వుండాలి. అవును. తాను ఇక్కడఎందుకు నిలుచున్నట్టు? మరోచోట ఎక్కడా ఆమె దర్శనం కాదు. తనకు భగవంతునిమీద భక్తి లేకున్నా ద్వేషం మాత్రం లేదు. ఉన్నాడని గట్టిగా నమ్ముతున్నా లేడని వాదించవలసినంత మూర్ఖత తనలో లేదు. శివాలయం వద్ద కోలని పక్కగా బొడ్డుమల్లె నీడ తన మనస్సుకు ఎందుకో ప్రశాంతి నిస్తుంది. తాను కూడా గుడిలోకి వెడితే బాగుంటుందా ఇప్పుడు? అని ఆలోచించుకున్నాడు రామం. ఇప్పుడు వెళ్ళితే ఆమెకు మరీ కోపం రావచ్చు. ఆమెతో తనకుగల ఆ రెండేళ్ల పరిచయంలో ఎన్నడూ ఆమె అలా కోపంగా చూడలేదు. ఇవాళ ఇదేం కర్మ?— రామం కుంగిపోయాడు. తన దౌర్భాగ్యానికి నిందించుకున్నాడు. మరో సందేహం కలిగింది. ఆమె పెళ్లిఏర్పాట్లు ఏమైనా జరగడం లేదుకదా?

పావుగంటైంది. వీణ తిరిగిరాలేదు. చంద్రుడు బొడ్డుమల్లె కొత్తిమీదికి పాకుతున్నాడు. తాను ఇక్కడ ఉన్నాడని ఆమె రావడానికి సందేహిస్తోందేమో. తనమీద ఇంత ద్వేషం ఎందుకు కలిగింది ఆమెకు? పోట్లాడుకోలేదే. తగాదా పడలేదే. అభిప్రాయభేదం రాలేదే. మరి ఎవరైనా ప్రత్యర్థులు తనకు వ్యతిరేకంగా కల్లిబొల్లిమాటలు చెప్పి ఆమెలో ద్వేషం పొటమరింప జేయలేదుగదా? అయినా అంత ప్రత్యర్థు లెవరున్నారు? తనతో మంచిగానే మాట్లాడి తనను ద్వేషించేవాళ్లు ఉండవచ్చు, అనుకున్నాడు. కాని ఎవరూ వెంటనే తనకు స్ఫురించలేదు.

ఇంకా రాదేం గుళ్ళోనుంచి? తాను ఇక్కడినుంచి వెళ్ళిపోతే వస్తుందేమో! తనవల్ల ఆమె ఎంతసేపు గుళ్ళో ఉండిపోను? వెళ్ళిపోదామని బయలుదేరాడు. మనస్సు ఒప్పుకోలేదు. వీణమీద చెప్పరాని కోపం వచ్చింది. తాను చదువువదలి రాజకీయాల్లో చేరబోతున్నాడు. ఏరోజు ఎప్పుడు అరెస్టయి జైల్లో పడతాడో. మహాత్ముని వంటివాణ్ణి నిర్దాక్షిణ్యంగా నిర్బంధించే ప్రభుత్వానికి తానులెక్కా! ఈలోగా రెండునాళ్లు వీణను కళ్ళారా చూచుకోనైనా నోచుకోలేదా! అయినా ఈ ఆలోచన ఆమెకు ఉండరాదూ! తాను జైలుకు వెడతాడనేది ఆమెకూ తెలుసు. రాజకీయాల్లోకి వద్దని పదేపదే తానే బోధించింది. మనస్సులో జైళ్లూ, రైళ్లూ, రైఫిళ్లూ మెదిలాయి. ఇంటికి వెళదామని బయలుదేరాడు, వీణమీద చెప్పరాని కోపంతో. ఎందుకు తనంటే ఇంత నిర్లక్ష్యం. ఛీ. ఆడాళ్లంతా ఇంతే అనిపించింది. వీణ ప్రవర్తనకు ఆడాళ్లందరినీ నిందించడం తప్పు అనుకున్నాడు., తనకు స్త్రీలపై సహజంగా కల గౌరవాన్ని విడనాడడం ఇష్టంలేక.

ఇంతలో కిలకిలా నవ్వు వినిపించింది.

నందనవనంనుండి పారిజాతకుసుమాలు జలజల రాలినట్టు నవ్వింది, వీణ వెనుకనుంచి. గిరుక్కున వెనుతిరిగి చూచాడు. చంద్రుడు దానకర్ణుడిలా కొల్లకొల్లలుగా వెన్నెల కుమ్మరించాడు, వీణమీద. వీణ తనకు దగ్గరగా వచ్చింది. చిరునవ్వు చూపు చూచింది. చూపునిండా వలపు పరిమళాలు వున్నాయి. గాలిబ్ కవి అన్న మాటలు జ్ఞాపకం వచ్చాయి.

ఏల నన్ను మరచె ఎగుగబోయితి—ఆమె
వలపు చూపుమాచె భస్మమైతి.

ఆమె చూపు ఆమెమీద కలిగిన కోపాన్ని పెల్లగించి పారేసింది. "వీణా!" అన్నాడు రామం.

"ఎందుకు అలా పిలుస్తావు?"

"వీణ మ్రోగితే లోకాని కంతటికీ వినపడాలిగా."

"చాలెద్దూ. అన్నట్టు కాలేజీ ఎందుకు మానుకున్నావు?"

"మరి నీ వెందుకు మానుకున్నావ్?"

వీణనవ్వు

విసుగపడింది వీణ. జవాబివ్వలేదు. మరో వైపు తిప్పింది సంభాషణ.

"నువ్వు పాలిటిక్సులో పడుతున్నావుటగా?"

"అవును."

"పాలిటిక్సులో పడితే పడ్డావుగాని జైల్లో మాత్రం పడకు". నవ్వింది.

"రాసిపెట్టివుంటే తప్పుతుందా."

"నీకూ రాతాపూతలమీద నమ్మకం వుందీ?"

"లేంది శివాలయానికి ఎందుకు వస్తాను?"

"నా కోసం."

"నీ కోసమే రాతలమీద నమ్మకం."

"కొంటెవాడివి". నవ్వింది వీణ.

"వీణా!"

"టా! టా."

వెళ్ళిపోయింది వీణ. పెద్దదయిందని అంతా అనుకుంటున్నారు గాని వీణలోని చిలిపితనం, చిన్నతనం పోలేదు. చంద్రుడు దివిటీలా మండుతుంటే ఆ వెలుతురులో వీణ తనతో మాట్లాడిన చోటంతా వెతికాడు రామం. ఆమె జడలోని నీలాంబరాలూ మల్లెలూ నలుపు తెలుపూ కలగలుపుకుని నాలుగు మూడు రాలి, దొరికాయి. అవి చెవిలో చెక్కుకున్నాడు. ఎక్కడి కెళ్ళావురా అని అమ్మ అడిగితే గుళ్ళోకి అన్నాడు రామం, వీణ జడలోని పూలు చెవిలో చెక్కుకున్నవి చూపి.

మరునాడు రామం అరెస్టయినాడు. తల్లిని కూడా చూడడానికి రానివ్వలేదు, పోలీసులు. రామాన్ని జైలుకు పట్టుకెళ్ళారు. ప్లాట్ ఫారం వెనకగా వీణనుంచుని దుఃఖంగా చూచింది. ఆమె చూపులో ఎన్ని కాంతులో ఎన్ని కంపనలో... జైల్లో రామంకు వీణా తానూ కలిసి గడిపిన ఆరేండ్ల గాథా చలన చిత్రంగా గోచరించింది. మేష్టారు రాని పూట ఇద్దరూ ఒకచోట కూర్చుని తమ పేర్లు ఇంగ్లీషులో ఎలారాయాలో చర్చించేవారు. ఆమె VEENA అని రాస్తే తాను "వీ"ని డబ్లియు చేసేవాడు. 'వీన్' అన్న శబ్దం "వి"తో రాస్తారు గనుక 'వి' కరక్టు అనేది వీణ. 'వీక్' లో డబ్లియు ఉంది గనుక డబ్లియు ఉండాలనేవాడు రామం. తాను ఎప్పుడు ఆమెపేరు రాసినా WEENA అని రాశేవాడు. ఆమె ఎప్పుడూ 'వి'తో రాశేది తన పేరు; 'వి ఫర్ విక్టరీ' అనేది ఆమె. 'డబ్లియు ఫర్ వెల్త్' అనేవాడు రామం. జైల్లో ఉన్న మూడు సంవత్సరాలూ రామానికి ఆమె నీలి నీలి కళ్ళు, కళ్ళలోని కమ్మని కాంతులూ మనస్సులో కనిపిస్తుండేవి. క్రమంగా రామంకు వీణను గురించి వివరాలు తెలియటం మానేశాయి.

మూడేళ్ళ తరువాత బయటపడ్డాడు రామం. వీణకు ఒక కూతురు. రామం చలించకుండా ఈ వార్త విన్నాడు. ఆవిడ భర్త పోలీసు అధికారిట. జైలునుంచి తిరిగి వచ్చిన నాడు తల్లి వడ్డించినా అన్నం తినలేదు రామం. సాయంత్రం పూట శివాలయం వైపు వెళ్ళి బోడు మల్లెచెట్టు కింద నిలుచున్నాడు. సరిగా శుక్ల చతుర్దశి. చంద్రుడు బోడుమల్లె వెనుక వున్నాడు. అయితే అప్పుడప్పుడూ మబ్బువచ్చి అతన్ని తాకుతూ వెళ్ళిపోతోంది. ఎనిమిదవుతోంది. అభ్యంజన సుందరి వీణ గుడిలోకి వెళదామని వస్తోంది. రామం గుండె గుభేలుమంది. వీణ రామంను చూచింది. చెప్పరాని ఆనందంతో పొంగిపోయింది. ఆవిడలో ఆ నాటికీ ఈ నాటికీ ఎట్టి మార్పూ లేదు. అదే చిలిపితనం. అదే ఉత్సాహం.

రామం.

ఊఁ.

గుళ్ళోకి రావూ.

రాకేం. కానీ నీతోనా.

ఏం – భయమా!

అబ్బే భయం కాదు. బావుండదని.

ఏంఫరవాలేదు రా! మా ఆయన ఏమన్నా అంటాడనా? ఆయనకు నువ్వంటే ఎంత ఇష్టం అనుకున్నావ్?

ఆమె కళ్ళలోని కాంతులు మనస్సుకు అందని. విచిత్రాల్లా మిలమిలా మెరిశాయి.

"పద గుడిలోకి" అన్నాడు రామం.

కిలకిలా నవ్వింది వీణ.

ఆ నవ్వులో ఎంత అమాయికత – ఎన్ని కాంతులు! ★

ఎదురు తెన్నులు

నీ దర్శనమ్ముకోసము నేను స్వామి
ఎదురుతెన్నులు గాచితి నిదురవచ్చె
మరల మేల్కాంచి ఎన్నియోమార్లు నిదుర
పోయినాడను నీ జాడ పొలుపు లేదు.

నీదు సాక్షాత్కారమ్ము నీదు స్నేహ
మెంత తీయనిహాయి ఊహించినంత -
ఊహలందున మధురిమ దైహికముగ
మరులుగొల్పని జీవమే మరువు నాకు.

రిత్త పరుగులువెట్టి మరీచికలకు
వేయిపాటులుపాడి తద్వీచికలకు
బదులు పొందిక లేక నీ పాదికలకు
మేలుకొనలేక వాల్చితి మేను నేను.

తిరిగి మేనొక క్రొత్తది తెచ్చికొంటి
కన్నువిచ్చితి ననుభవ కక్ష్య దాటి
భవమె అనుభవమయ్యె నా భావ వీధి
పరచికొన్నది తిమిర మభావరేఖ.

భవమ్మనుభవమును భావ మభావమనగ
ఎండమావులు నాలుగు తాండవించు
నీదు రమణీయ సత్కృపానీరజమ్ము
ఎందుగనువిచ్చు నీ నాల్గింటిలోన.

—బెజవాడ సదానందం